# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 07-02-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- నక్సలిజం వల్ల యువత, గిరిజనులు పెద్ద ఎత్తున నష్టపోయారని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు.
- భారత్, మలేషియా దేశాల మధ్య బలమైన స్నేహ బంధం ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడించారు.
- అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందంతో రైతాంగానికి అధిక ప్రయోజనం చేకూరుతుందని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ తెలిపారు.
- సెమీకండక్టర్స్ తయారీ పర్యావరణ వ్యవస్థ అభివృద్ధిలో భారత్ గణనీయమైన పురోగతిని సాధిస్తోందని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు.
- పురుషుల టీ-20 క్రికెట్ ప్రపంచ కప్ లో భాగంగ భారత్, అమెరికా జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

=======================

నక్సలిజం వల్ల యువత, గిరిజనులు, దళితులు నష్టపోయారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ డివిజన్ ప్రధాన కార్యాలయమైన జగదల్‌పూర్‌లో బస్తర్ పండగను రాష్ట్రపతి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మావోయిస్టులపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాత్మక చర్యల వల్ల బస్తర్ ప్రాంతంలో ప్రశాంత వాతావరణం నెలకొందని తెలిపారు. బస్తర్ పండుగ గిరిజన సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. బస్తర్‌లో అభివృద్ధి జరుగుతోందని, మూసివేసిన పాఠశాలలు తిరిగి తెరుస్తున్నారని రాష్ట్రపతి చెప్పారు. రహదారులు నిర్మిస్తున్నారని, ఆరోగ్య సౌకర్యాలు అందుబాటులోకి వస్తున్నాయని ద్రౌపది ముర్ము పేర్కొంటూ..

(వాయిస్ 32 సెకన్లు)

ఈ కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్ గవర్నర్ రామెన్ డేకా, ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి తదితరులు పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, మలేషియా దేశాల మధ్య బలమైన బంధం ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడించారు. రెండు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం మలేషియాలోని కౌలాలంపూర్‌కు ప్రధానమంత్రి ఈ రోజు చేరుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగిస్తూ... ఇరు దేశాల హృదయాలను కలిపే సజీవ వారధిగా భారతీయ ప్రవాసులను అభివర్ణించారు. భారతదేశం మలేషియా తమ సంబంధాలను 2024లో సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యానికి పెంచాయని నరేంద్ర మోదీ గుర్తు చేశారు. వందకు పైగా భారతీయ ఐటీ కంపెనీలు మలేషియాలో పని చేస్తున్నాయని, వేలాది ఉద్యోగాలను సృష్టిస్తున్నాయని ప్రధాని పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

ఈ పర్యటన సందర్భంగా మలేషియాతో రక్షణ భద్రతలో సహకారాన్ని పెంపొందించడం, ఆర్థిక సంబంధాలను బలోపేతం చేయడం వంటి వాటికి సంబంధించి ఆ దేశ ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీంతో నరేంద్ర మోదీ చర్చలు జరుపుతారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

సెమీకండక్టర్స్ తయారీ పర్యావరణ వ్యవస్థ అభివృద్ధిలో భారతదేశం గణనీయమైన పురోగతిని సాధిస్తోందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. బెంగళూరులో క్వాల్కమ్ తయారు చేసిన 2 నానోమీటర్ సెమీకండక్టర్ చిప్స్‌ను ఆయన ఈ రోజు ఆవిష్కరించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... కృత్రిమ మేధ (ఏఐ), సెమీకండక్టర్స్ రంగంలో భారతదేశం తన ప్రతిభను ప్రపంచ వ్యాప్తంగా అందించగలదన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ రంగంలో 85 వేల మంది ఇంజనీర్లకు శిక్షణ ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. కేవలం 4 సంవత్సరాలలో దేశంలో 67 వేల మంది ఇంజనీర్లు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. దేశంలో 315 విశ్వవిద్యాలయాలలో విద్యార్థులు చిప్ తయారీ ప్రక్రియలను ట్యాపింగ్, వ్యాలిడేటింగ్ చేస్తున్నారని కేంద్రమంత్రి వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

బడ్జెట్ లో సామాన్యులకు భారం తగ్గించేలా పలు వ్యాధులకు సంబంధించిన ఔషధాలపై ప్రభుత్వం పన్నులను మినహాయించిందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. 17 రకాల క్యాన్సర్ మందులు.. అలాగే 7 రకాల అరుదైన వ్యాధుల మందులకు ఈ మినహాయింపు లభించిందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ పర్యటనలో భాగంగా విజయవాడలో కేంద్ర బడ్జెట్ పై ఆయన పాత్రికేయులతో ఈ రోజు మాట్లాడుతూ... 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా బడ్జెట్ కార్యాచరణ రూపొందించిందని చెప్పారు. రాబోయే 25 ఏళ్ల అభివృద్ధి కోసం నిర్దేశించుకున్న బడ్జెట్ గా జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

అమెరికాతో వాణిజ్య ఒప్పందం వల్ల దేశంలోని రైతాంగానికి అధిక ప్రయోజనం చేకూరుతుందని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ఈ వాణిజ్య ఒప్పందం ద్వారా 50 శాతం సుంకాలను 18 శాతానికి అమెరికా తగ్గించిందన్నారు. అలాగే మరి కొన్ని వస్తువులపై సుంకాలు లేవని తెలిపారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన పాత్రికేయుల సమావేశంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ... అమెరికాతో ఒప్పందం ద్వారా భారత్‌కు గణనీయమైన లాభాలు ఉన్నాయని చెప్పారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఎంతో ఉపయోగం ఉందని అన్నారు. దేశీయ ఎగుమతులు పెరిగి మహిళలు, యువతకు కొత్త ఉపాధి అవకాశాలు లభిస్తాయని పీయూష్ గోయల్ వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) సంఖ్య 6 నుండి 23కి పెరిగిందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా తెలిపారు. దీని వల్ల దేశవ్యాప్తంగా ప్రపంచ స్థాయి ఆరోగ్య సంరక్షణతో కూడిన బలమైన వ్యవస్థ ఏర్పడిందన్నారు. హర్యానా ఫరీదాబాద్‌లోని ఒక విద్యా సంస్థలో ఈ రోజు జరిగిన స్నాతకోత్సవంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ... మాతా శిశు ఆరోగ్య పరిరక్షణ, అంటువ్యాధుల నియంత్రణ, ఇతర కీలక ఆరోగ్య పరిరక్షణ చర్యలలో భారతదేశం గణనీయమైన పురోగతిని సాధించిందని గుర్తు చేశారు. దేశంలో క్షయవ్యాధి తగ్గుదల రేటు ప్రపంచ సగటు కంటే రెట్టింపు ఉండటంతో భారతదేశం సాధించిన పురోగతిని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రశంసించిందని గుర్తు చేశారు. నైతిక ప్రవర్తనతో పాటు.. ప్రజా సేవ పట్ల నిబద్ధతతో పట్టభద్రులైన విద్యార్థులు ముందుకు సాగాలని జగత్ ప్రకాష్ నడ్డా పిలుపునిచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

పులుల సంరక్షణ విధానాన్ని సవరించాల్సిన అవసరం ఉందని కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ పేర్కొన్నారు. రాజస్థాన్ లోని అల్వార్ జిల్లాలో నిర్వహించిన పులుల సంరక్షణ కేంద్రాల క్షేత్ర సంచాలకులు, ప్రధాన వన్యప్రాణి సంరక్షకుల రెండు రోజుల సదస్సును ఉద్దేశించి ఆయన ఈ రోజు ప్రసంగించారు. జాతీయ పులుల సంరక్షణ అథారిటీ (NTCA) గత సమావేశాలలో తీసుకున్న నిర్ణయాలను సమీక్షించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ప్రస్తుత సవాళ్లకు అనుగుణంగా పులల సంరక్షణ విధానాన్ని ఆధునీకరించడం అవసరమని కేంద్రమంత్రి అన్నారు. ఇదిలా ఉండగా బోట్స్వానా నుండి మరో చిరుత పులుల బృందం ఈ నెలాఖరులోగా భారతదేశానికి చేరుకుంటుందని కేంద్రమంత్రి చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ - అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందం రెండు దేశాలకు శుభవార్త అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ ఒప్పందం భారత్ - అమెరికా మధ్య బలమైన భాగస్వామ్యం పెరుగుతున్న విశ్వాసాన్ని తెలియచేస్తుందని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పెట్టిన పోస్టులో ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య సంబంధాల బలోపేతానికి వ్యక్తిగతంగా కృషి చేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు ప్రధానమంత్రి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం భారతీయ రైతులు, పారిశ్రామికవేత్తలు, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్ ఆవిష్కర్తలు, మత్స్యకారులకు కొత్త అవకాశాలను సృష్టిస్తుందని తెలిపారు. దీని వల్ల మేకిన్ ఇండియా సంకల్పాన్ని బలోపేతం చేస్తుందని నరేంద్రమోదీ వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

పురుషుల టీ-20 క్రికెట్ ప్రపంచ కప్ లో భాగంగ భారత్, అమెరికా జట్ల మధ్య ముంబైలోని వాంఖెడే స్టేడియం వేదికగా క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన అమెరికా బౌలింగ్ ఎంచుకుంది. ముందుగా బ్యాటింగ్ చేస్తున్న భారత్ 17 ఓవర్లకు 7 వికెట్ల కోల్పోయి 122 పరుగులు చేసింది. అంతకుముందు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా వెస్టిండీస్, స్కాట్లాండ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో వెస్టిండీస్ 35 పరుగుల తేడాతో విజయం సాధించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

వ్యవసాయం, సహకార రంగం భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నాయని కేంద్ర సహకార, పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహోల్ తెలిపారు. పూణేలోని వైకుంఠ మెహతా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కో-ఆపరేటివ్ మేనేజ్‌మెంట్‌లో జరిగిన 31వ వార్షిక స్నాతకోత్సవ కార్యక్రమంలో ఆయన ఈ రోజు పాల్గొన్నారు. ఈ

సందర్భంగా మాట్లాడుతూ... సహకార రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించడం చాలా అవసరమని విద్యార్థులకు సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = =